క్లుప్తంగా

జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపిక



కోస్గి రూరల్: జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సైక్లింగ్ పోటీలలో ముశ్రీఫా విద్యార్థులు ప్రతిభ కనబరచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోపాలం , ముశ్రీఫా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేఖరయ్య అన్నారు. ఈనెల 13న జరిగిన జిల్లా స్థాయిలో ఇండియా ఉమెన్స్ , గర్ల్స్ 10 కిమీ రోడ్ స్పీడ్ సైక్లింగ్ పోటీల్లో విద్యార్థినులు లక్ష్మి , గీతాంజలి, కవిత , శ్వేత సత్తా చాటడంతో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయ బృందం శనివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ పుష్పలత, బాలకృష్ణ, సత్యనారాయణ, శివశంకర్ తదితరులు ఉన్నారు.

ముగిసిన కొడిపీర్ల ఉత్సవాలు



నర్వ: మండలంలోని లంకాల్ గ్రామంలో ఏటా నిర్వహించే కొడిపీర్ల ఉత్సవాలు శనివారంతో ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఏడాది ఉత్సవాలకు మంత్రి వాకిటి శ్రీహరి హాజరై పీర్లను దర్శించుకొని తులాభారంలో పాల్గొనడం ఉత్సవాలకు కొత్తశోభ నిచ్చిందన్నారు. ఈ సందర్భంగా గత పదిరోజులుగా చేపట్టిన కార్యక్రమాలకు ముగింపుగా శనివారం పీర్ల చావిడి ముందు మూడు రోజుల ఫాతేహా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో మౌళాలి పీరు సవారీ బాబుమియ్యా, సైఫల్ అన్సారీ, గ్రామస్తులు, మైనార్టీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలి

ఊట్కూరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలని సీపీఐఎంఎల్ డివిజన్ కార్యదర్శి అబ్దుల్ సలీం డిమాండ్ చేశారు. శనివారం బిజ్వార్ గ్రామంలో అఖిల భారత ఐక్యరైతు సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నూతన వ్యవసాయ మార్కెట్ విధాన బిల్లులను వెంటనే రద్దు చేయాలని కోరారు. స్వామినాథన్ సిఫార్సుల మేరకు మద్దతు ధర నిర్ణయించి గ్యారంటీ చట్టాలను చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, చెన్నప్ప, కనకరాయుడు, రాము పాల్గొన్నారు.

రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

మక్తల్: మండలంలోని భూత్పూర్ రిజర్వాయర్ రైట్ కెనాల్ నుంచి నీళ్లు సక్రమంగా వదలడం లేదని రైతులు మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన కెనాల్ వద్దకు వెళ్లి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కెనాల్ నుంచి నీటిని విడుదల చేయించారు. ఖరీఫ్‌లో రైతులు వరి సాగు చేసుకునేందుకు నీళ్లు అవసరమన్నారు. రైతుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని అధికారులకు సూచించారు. ఆయన వెంట మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, మాజీ సర్పంచు కుర్వ హన్మంతు, కృష్ణయ్య, ఆనంద్ శేఖర్, అశోక్ కుమార్ గౌడ్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

23న విద్యాసంస్థల బంద్

నారాయణపేట రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 23న విద్యాసంస్థల బంద్ నిర్వహించనున్నట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాయి కుమార్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు నరహరి తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడుస్తున్న విద్యాశాఖకు మంత్రి లేకపోవడం విచారకరమన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి చేపట్టిన బంద్‌ను ప్రతిఒక్కరు విజయవంతం చేయాలని కోరారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

నారాయణపేట రూరల్: ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని సీఎంవో రాజేంద్రకుమార్ అన్నారు. పట్టణంలోని ఎమ్మార్సీ, భవిత భవనం పరిసరాల్లో శనివారం ఆయన మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందు వరుసలో ఉండాలని అలాగే మొక్కల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

కాలనీల్లో కంపు..కంపు

- చెత్తతో నిండిపోయిన మురుగు కాల్వలు
- విషజ్వరాలు ప్రబలే అవకాశం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మక్తల్: మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. చిన్నపాటి వర్షానికే రోడ్లపై మురుగు పారుతుండడంతో రోడ్లు మురుగు కాల్వల్లా దర్శనమిస్తున్నాయి. ఇక భారీ వర్షం కురిసినప్పుడు వీధుల్లో ఇళ్ల మధ్యన మురుగు రోజుల తరబడి నిలిచి ఉండటంతో దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు సమస్య పరిష్కారానికి అధికారులు ప్రత్యేక సిబ్బందిని నియమించినా ప్రయోజనం లేకుండా పోయింది. పారిశుద్ధ్య సిబ్బంది కాలనీల్లో డ్రెయినేజీలు నిండిన తీయడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎక్కడికక్కడా పేరుకుపోయిన చెత్త..

పట్టణంలోని ప్రధాన కూడళ్లలో పారిశుద్ధ్యం లోపించడంతో దుర్వాసనకు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. మక్తల్ బస్టాండ్ నుంచి ప్రభుత్వ ఆస్పత్రి వరకు సీసీరోడ్డు పక్కన ఉన్న మురుగు కాల్వలు శుభ్రం చేయక ఏళ్లు గడుస్తుంది. వైద్య సిబ్బంది సైతం దోమల నివారణకు ఫాగింగ్ చేయడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో పట్టణంలో ఎక్కడికక్కడా చెత్త పేరుకుపోవడంతో పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దోమల బెడద కూడా అధికంగా ఉండడంతో విషజ్వరాల బారిన పడే అవకాశం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచి విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బసవేశ్వర కాలనీలో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు

ప్రతిపాదనలు పంపించాం

మక్తల్ మున్సిపాలిటీలోని కాలనీల్లో డ్రెయినేజీలు, సీసీరోడ్లు, గుంతలు ఉన్న చోట్ల మరమ్మతు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సీసీ రోడ్ల ఏర్పాటు గుంతల పూడ్చివేత తదితర పనులు చేపట్టేందుకు రూ.15 కోట్లతో సీఎండీ అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– శంకర్‌నాయక్, కమిషనర్, మక్తల్ మున్సిపాలిటీ



వినాయకనగర్‌లోని కాల్వలో పేరుకుపోయిన చెత్తచెదారం



నేతాజీ నగర్‌లో మురికి గుంత

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

నారాయణపేట రూరల్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి విమర్శించారు. మండలంలోని కోటకొండ గ్రామంలో శనివారం నిర్వహించిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలులో హస్తం పార్టీ రైతులు, కార్మికులు, మహిళలు, విద్యార్థులను మోసం చేసిందని మండిపడ్డారు. ఆరు గ్యారంటీల అమలులో ఇచ్చిన మాట పూర్తిగా తప్పిందని ఎద్దేవ చేశారు. రాబోవు రోజుల్లో రైతు భరోసా ఎత్తి వేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల్లో కాంగ్రెస్ పట్ల పూర్తిగా వ్యతిరేకత వచ్చిందని, రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ పార్టీని గెలిపించిడం ఖాయమన్నారు. అన్ని చోట్ల బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకునేందుకు కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అంతకుముందు మార్కండేయ దేవాలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు వేపూరి రాములు, మాజీ ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్ రెడ్డి, వెంకట్రాములు గౌడ్, భగవంతు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్ రెడ్డి

మందిపల్లి పాఠశాలలో బోనాల పండుగ

మాగనూర్: మండల పరిధిలోని మందిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందుస్తు బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సరిత మాట్లాడుతూ.. తెలంగాణ అనగానే అందరికీ గుర్తుకొచ్చేది బోనాల పండుగ అని, ఈ పండుగకు చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. విద్యార్థులు చేతులకు గోరింటాకు పెట్టుకొని, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో శనివారం రోజు ఉత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, శ్రీదేవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో బోనాలతో విద్యార్థులు

బోనాల సందడి

మక్తల్: మండలంలో ఉప్పర్‌పల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు బోనాలను వైభవంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థులు బోనాలు ఎత్తుకోగా ఉపాధ్యాయులు బోనాల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



నారాయణపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెడుతున్న కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కార్మిక సంఘం నాయకులతో కలిసి డీఈఓ గోవిందరాజుకు వినతిపత్రం అందించారు. 9 నెలలుగా భోజనం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, అదే విధంగా 11 నెలలుగా కోడిగుడ్ల బిల్లులు, ఏడాదిన్నర నుంచి గౌరవ వేతనం చెల్లించాల్సి ఉందన్నారు. కార్మికులు అప్పులపాలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెనూ విషయంలో అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని, గర్ల్స్ స్కూల్ లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న సిబ్బందిని తొలగించడం సరికాదన్నారు. పెండింగ్ బిల్లులు మంజూరుకు ఈ నెల 22న కలెక్టరేట్ ముందు ధర్నా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జయంతి, యాదమ్మ, మహాదేవమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.

21న కస్తూర్బా కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

మద్దూరు: మండల పరిధిలోని పెదిరిపాడ్ కస్తూర్బా గాంధీ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఈ సీట్లను ఈనెల 21న స్పాట్ అడ్మిషన్లు కల్పించి భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ గౌరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన బాలికలు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ధృవపత్రాలతో సోమవారం నేరుగా కళాశాలకు వచ్చి స్పాట్ అడ్మిషన్ పొందవచ్చన్నారు.

జిల్లా కార్యాలయం పనుల పరిశీలన



నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో త్వరలో బీజేపీ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజీ తెలిపారు. శనివారం ఆయన రాష్ట్ర నాయకులు కే. రతంగ్ పాండురెడ్డి, జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్, పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్‌తో కలిసి నారాయణపేటలో నిర్మిస్తున్న బీజేపీ పార్టీ కార్యాలయాన్ని సందర్శించి జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్ని పనులు మిగిలి ఉన్నాయని వాటిని పూర్తి చేసి త్వరలోనే కార్యాలయాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు.

నేడు విస్తృతస్థాయి సమావేశం

నర్వ: మండల బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, చిట్టెం సుచరితరెడ్డిలు హాజరవుతున్నారన్నారు. మాజీ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఆర్థిక భరోసా కల్పించడమే ధ్యేయం

కోస్గి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని మైనారిటీ మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకే తెలంగాణ ప్రభుత్వం మైనారిటీ కార్పొరేషన్ ద్వారా కుట్టుమిషన్ల పంపిణీ చేపట్టిందని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని పోతిరెడ్డిపల్లి, గుండ్లపల్లి , మల్‌రెడ్డిపల్లి , నాగసాన్‌పల్లి , మాసాయిపల్లి, సంపల్లి గ్రామాలకు చెందిన 41మంది మైనారిటీ మహిళలకు మున్సిపల్ కార్యాలయంలో కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థిక ప్రగతి సాధించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షులు బెజ్జురాములు, పట్టణ అధ్యక్షులు తుడుం శ్రీనివాస్ , మాస్టర్ శ్రీనివాస్, బాలేష్ , మేకల రాజేష్ , బాల్‌రాజ్ , కృష్ణమూర్తి, ఓంప్రకాష్ , నాగులపల్లి శ్రీనివాస్, ఇద్రిస్, ఆసిఫ్, ఫిరోజ్ తదితరులు ఉన్నారు.



కుట్టుమిషన్లను పంపిణీ చేస్తున్న కమిషనర్ నాగరాజు, నాయకులు

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి



ట్రేడ్ లైసెన్స్‌ను జారీ చేస్తున్న అధికారులు

కోస్గి: ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి బట్ట సంచులను వాడాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. శనివారం 100 రోజుల కార్యాచరణలో భాగంగా పట్టణంలోని రామాలయం నుంచి శివాజీ చౌరస్తా వరకు పరిసరాల శుభ్రతపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణాన్ని స్వచ్ఛంగా ఉంచుకోవాల్సిన బాధ్యతపై అందరిపై ఉందన్నారు. అలాగే పలు వ్యాపార సముదాయాల నూతన ట్రేడ్ లైసెన్స్‌లను జారీ, రెన్యూవల్ చేశారు. కార్యక్రమంలో మేనేజర్ అనిల్‌కుమార్ , హెల్త్ అసిస్టెంట్ మోహిన్‌బాషా, మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతు ఎఫ్‌పీఓ సభ్యత్వం తీసుకోవాలి

ధన్వాడ: ప్రతి రైతు రూ.2వేలు చెల్లించి రైతు ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యులుగా చేరాలని ధన్వాడ సింగిల్ విండో అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి అన్నారు. శనివారం కొండాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉత్పత్తిదారుల సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు అవగాహన కల్పించారు. విండో పరిధిలోని రైతులు 750 మంది సభ్యులుగా చేరితే ప్రభుత్వం రూ.15లక్షల గ్రాండ్ అందజేస్తుందని అలాగే సొసైటీ సభ్యత్వం ద్వారా మరో రూ.15లక్షల గ్రాండ్ కలిపి రూ.30 లక్షలతో ఉత్పత్తి సంఘం ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి శంకరాచారి, నోడల్ అధికారి రఫీయుద్దీన్, ఆడిట్ అధికారి రామ్‌గోపాల్, రిజిస్టర్ ఆంజనేయులు, సీఈఓ వెంకట్రాములు, అనసూయ, రాముడు పాల్గొన్నారు.



సభ్యత్వ పత్రం అందజేస్తున్న వెంకట్రామారెడ్డి

విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు సర్వే

కోస్గి రూరల్: మండల పరిధిలోని ముశ్రీఫా గ్రామానికి మంజూరైన 133–11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల అధికారులు శనివారం సర్వే చేపట్టారు. గతంలో ముశ్రీఫా గ్రామ శివారులో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్ని ఎంపిక చేయగా అది దూరం కావడంతో ఈ సారి పల్లె ప్రకృతి వనంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు.ఈ క్రమంలో ఫారెస్టు, మండల, విద్యుత్ అధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టారు. నివేదికను తయారు చేసి కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శ్రీధర్ , విద్యుత్ డీఈ సుధారాణి, ఏఈ వెంకటేష్ , ఫారెస్టు అధికారి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న మండల అధికారులు

గోరింటాకు సంబరాలు



గోరింటాకు చూపిస్తున్న టీచర్లు, విద్యార్థులు

నారాయణపేట రూరల్: మండలంలోని జాజాపూర్ జడ్పీ పాఠశాలలో శనివారం గోరింటాకు సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్ఓ భాను ప్రకాష్ మాట్లాడుతూ ఆషాడ మాసంలో గోరింటాకు ప్రాముఖ్యతను విద్యార్థికి తెలియజేశారు.గోరింటాకు పెట్టుకోవడం వల్ల శరీరంలో వేడిని తగ్గించి రోగ నిరోధక శక్తి పెంచి రక్త ప్రసరణ బాగా జరిగే విధంగా చేస్తుందన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు గోరింటాకు పెట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం భారతి, టీచర్లు విజయ మంగళ, శశిరేఖ, శ్రీదేవి, శిరీష మధుసూదన్ పాల్గొన్నారు.

మహాగర్జనను జయప్రదం చేయాలి

మరికల్: ధన్వాడలో ఆదివారం నిర్వహించనున్న దివ్యాంగుల మహాగర్జన జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు నర్సింములు శనివారం ఒక ప్రకటనలో అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే దివ్యాంగులకు రూ.6 వేలు పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చి తీరా ఇప్పుడు మాట తప్పడం న్యాయం కాదన్నారు. అలాగే వితంతువు, ఒంటరి మహిళలకు రూ.4వేల పింఛన్ అందజేయాలని డిమాండ్ చేశారు. మోసపూర హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయడానికే ఈ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నాయీ బ్రాహ్మణులకు అండగా నిలబడాలి

ఊట్కూరు: ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులకు అండగా నిలబడాలని నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు రాధాకృష్ణ అన్నారు. ఊట్కూరులో శనివారం నాయీబ్రాహ్మణుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నాయీబ్రాహ్మణుల కులవృత్తిని ఇతర కులస్తులు చేపట్టడం వల్ల తమకు జీవనోపాధి కరవవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన ఆర్టికల్ 19 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నాయీబ్రాహ్మణులకు ఉపాధి లేకపోవడంతో పట్టణ ప్రాంతాలకు వలస వెళ్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కాశప్ప, వెంకటేష్, రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'సంస్కార భారతి' కమిటీ ఎంపిక

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో శనివారం సంస్కార భారతి జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పద్మశ్రీ అవార్డు గ్రహీత దాసరి కొండప్ప, ప్రాంత సంఘటన మంత్రి జేపీ నిరంజన్ హాజరై మాట్లాడుతూ సంస్థ సేవలను కొనియాడారు. అనంతరం సమితి అధ్యక్షుడిగా హారతి (మక్తల్), ప్రధాన కార్యదర్శిగా మల్లేష్ (నారాయణ పేట), జిల్లా సంయుక్త ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ దీపికా (నారాయణపేట)తో పాటు 20 మందితో నూతన కమిటీని ఏర్పాటు చేశారు.

కర్ణాటక మద్యం పట్టివేత



మాగనూర్: మండల పరిధిలోని ఉజ్జేల్లి గ్రామంలో శనివారం ఓ వ్యక్తి అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు గ్రామానికి చెందిన సాకలి భీమేష్ అనే వ్యక్తి ఇంట్లో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు తెలియడంతో దాడి చేసి 15 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ అనంతయ్య తెలిపారు. ఎవరైనా మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలను కలిగి ఉంటే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ శిరీష, సిబ్బంది సురేష్, కృష్ణవేణి, నరేష్, గౌషియా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మరికల్: మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వెంకట్ నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు, రైతులు గమనించి సహకరించాలని కోరారు.

బోధన సహాయకులను నియమించాలి



ధన్వాడ: ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలో వెంటనే బోధన సహాయకులను నియమించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి కోరారు. శనివారం ధన్వాడ మండలంలో సభ్యత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించగా కొండాపూర్, కిష్టాపూర్, గోటూర్ పాఠశాలలో ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలు పరిష్కరించి పీఆర్సీ ప్రకటించాలన్నారు. అలాగే పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

మరికల్: మండలంలోని కేజీబీవీ ఇంటర్ కళాశాలలో చేరేందుకు పదో తరగతి ఉతీర్ణులైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌వో రాజ్యలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో అగ్రికల్చర్ గ్రూపులో 20 సీట్లు ఖాళీగా ఉన్నాయని, వీటికి ఈ నెల 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు రక్తదాన శిబిరం

ఊట్కూరు: ఊట్కూరులోని శక్తి ఫౌండేషన్ కార్యాలయంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు చింతన్‌పల్లి శివప్రసాద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదాన శిబిరం అనంతరం ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యువకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

మరికల్: మండలంలోని అప్పంపల్లి శివారులోని పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. అప్పంపల్లి శివారులో గత కొంతకాలంగా కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి పట్టుకున్నట్లు ఏఎస్ఐ ఎల్లయ్య తెలిపారు. అలాగే నిందితుల నుంచి రూ.6,600, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.